
సాక్షి
కాకినాడ

శుక్రవారం | 9 | ఆగస్టు | 2024




కొత్త పాలసీతో మందుకు..
ఫుల్‌గా తాగించి పేద కుటుంబాలను చిత్తు చేసే విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది.. నూతన మద్యం పాలసీని తెరపైకి తీసుకువచ్చింది.

8లో



స్వర్ణమయం.. బహుసుందరం
రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయం ముంగిట ధ్వజస్తంభం స్వర్ణ శోభతో కళకళలాడుతోంది. నూతన ధ్వజ స్తంభానికి స్వర్ణ రేకు తాపడం పనులు గురువారం ప్రారంభమయ్యాయి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం 6,88,962 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రం లోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజీ వద్ద 9.50 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 7,500 క్యూసెక్కులు విడుదల చేశారు.

కొండంత పంతం!

- కాకినాడ పోర్టులో బస్తీ మే సవాల్
- కాకినాడ సిటీ, రూరల్ నేతల మధ్య కోల్డ్ వార్
- పీఆర్వో, ఏపీఆర్వో పోస్టుల కోసం హోరాహోరీ
- రెండు పేర్లతో సిఫారసు చేసింది ఒకరు
- ఆ లేఖను చెత్తబుట్టలో వేయమన్న మరో నేత
- రూ.లక్షలు పలకడమే ఆ పోస్టుల ప్రత్యేకత



సాక్షి ప్రతినిధి, కాకినాడ: కూటమి ముఖ్య నేతలు కాకినాడ పోర్టులో బస్తీమే సవాల్ అంటున్నారు. పోర్టుపై ఆధిపత్యం తమదంటే తమదంటున్నారు. పోర్టు తన పరిధిలోకి వస్తుందంటే తన పరిధిలోకి వస్తుందంటున్నారు. పోర్టులో రెండు పోస్టుల నియామకం కోసం కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాలకు చెందిన కూటమి కీలక ప్రజాప్రతినిధులు ఇద్దరూ హోరాహోరీగా తలపడుతున్నారు. కాకినాడ పోర్టులో పోర్టు రిజిస్ట్రేషన్ అధికారి (పీఆర్వో) అసిస్టెంట్ పోర్టు రిజిస్ట్రేషన్ అధికారి (అసిస్టెంట్ పీఆర్వో) పోస్టుల కోసం వీరి మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. సార్వత్రిక ఎన్నికల వరకు ఒకరికొకరు సలహాలు పంచుకున్న వారి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. పోర్టుపై ఆధిపత్యం కంటే ఆ పోస్టుల నియామకమే ఈ వివాదానికి ప్రధాన కారణమంటున్నారు. ఆ పోస్టులు రూ.లక్షలు పలుకుతుండటంతో పోరు తీవ్రమైంది. పీఆర్వో పోస్టుకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలు, అసిస్టెంట్ పీఆర్వో పోస్టు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షలు పలుకుతోంది. కాకినాడలో రెండు పోర్టులు(యాంకరేజ్ పోర్టు, డీప్ వాటర్ పోర్టు) ఉన్నాయి.ఈ రెండు పోర్టులలో అత్యధికంగా కార్గో హేండిలింగ్ జరిగేది ప్రైవేటు డీప్‌వాటర్ పోర్టులోనే. ఇది కాకుండా ప్రభుత్వ అజమాయిషీలో నడిచే యాంకరేజ్ పోర్టు కూడా ఒకటి ఉంది.

ఆ పోస్టులో ఉంటే కాసుల వాన

ఈ రెండు పోర్టుల కార్యకలాపాల ప్రక్రియను పీఆర్వో, ఏపీఆర్వోలు పర్యవేక్షిస్తుంటారు. ఈ రెండు పోస్టులు కూడా కాసులు, విలువైన కానుకలు, డాలర్లు కురిపిస్తుంటాయి. కాకినాడ పోర్టుకు ఏదైనా దేశం నుంచి కార్గో హేండిలింగ్ కోసం వచ్చే ఓడల్లో ఉద్యోగులు సైన్ ఆన్ (షిప్ విధుల్లో చేరడం), సైన్ ఆఫ్ (షిప్ విధుల నుంచి సెలవుల్లో స్వస్థలాలకు వెళ్లడం) చేస్తుంటారు. వివిధ దేశాల నుంచి ఓడల్లో విధుల్లో భాగంగా వచ్చే ఉద్యోగులు కాకినాడ పోర్టులో దిగి ఇక్కడి నుంచి సెలవుల కోసం రాజమహేంద్రవరం, విశాఖపట్టణం ఎయిర్‌పోర్టులకు వెళుతుంటారు. విదేశీ ఉద్యోగులు ఇలా వెళ్లడానికి పీఆర్వో, ఏపీఆర్వోలే అనుమతిస్తారు. వారు విధుల్లో తిరిగి చేరాలన్నా, విధుల నుంచి దిగాలన్నా పీఆర్వో, ఏపీఆర్వోల అనుమతి తప్పనిసరి. అలాగా షిప్‌లో పనిచేసే క్రూ (సిబ్బంది)కి ఏ వస్తువు అవసరం వచ్చినా వీరు పరిశీలించాకే అందజేయాలి. ఈ ప్రక్రియ నిర్వర్తించేందుకు సంబంధిత షిప్‌లో ఉద్యోగుల తరఫున కాకినాడ పోర్టు పరిధిలో ఒక ఏజెన్సీ ఉంది. షిప్‌లోని ఉద్యోగి పాస్‌పోర్టు, సీమెన్‌బుక్, పోలీసుల వైపు నుంచి ఇమిగ్రేషన్, ట్రావెల్ పర్మిట్‌ను వీరు పరిశీలించి సంతృప్తి చెందితేనే అనుమతిస్తారు. ఈ రకంగా అందరికీ కాకున్నా కొందరికి కాసుల వర్షం కురిపిస్తుంది. ఒకో దానికి ఒకో రేటు కూడా ఉంటుందనేది బహిరంగ రహస్యమేనని పోర్టు వర్గాలు చెబుతున్నాయి. సైన్ ఇన్, సైన్ ఆఫ్‌కు రూ.300, షిప్ తనిఖీకి రూ.1,500, ట్రావెల్ పర్మిట్‌కు రూ.1,300 ఇలా రేట్లున్నాయి. విదేశీయులు తమ వెంట తెచ్చే ఖరీదైన మద్యం, కాస్మాటిక్స్, సెంట్స్, సిగరెట్లు వంటి కానుకలూ వీరికి ఇస్తుంటారు. అందుకే ఆయా పోస్టులకు రూ.లక్షల ముడుపులు ముట్టచెప్పేటంతటి గిరాకీ ఏర్పడిందంటున్నారు.



గడువు ముగియకుండానే..

ఈ రెండు పోస్టుల కోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏ పోలీసు స్టేషన్‌లో వారైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ పోస్టులను ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కోరుకుంటుంటారు. ఇంతా చేసి ఆ రెండు పోస్టుల కాలపరిమితి ఏడాది మాత్రమే. ఏడాది తరువాత కొత్త వారిని నియమించడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ పోస్టులలో నియమితులయ్యే వారు జనవరి ఒకటో తేదీ బాధ్యతలు స్వీకరిస్తే డిసెంబరు 31న వైదొలగాలి. ఈ పోస్టులకు కాకినాడ జిల్లా స్థాయి పోలీసు అధికారి సిఫారసుతో కాకినాడ కలెక్టర్ ద్వారా నియామక ఉత్తర్వులు వెలువడుతుంటాయి. ఈ రెండు పోస్టుల్లో విధులు నిర్వర్తిస్తున్న వారి పదవీ కాలం మరో నాలుగు నెలలు మిగిలి ఉంది. అయినా ఈ పోస్టుల్లో ఉన్న వారి గడువు ముగియకుండానే అర్ధంతరంగా నియామకాలు చేపట్టాలని కూటమి ముఖ్య నేతలు ఇద్దరు పోటాపోటీగా పావులు కదుపుతుండటం పోర్టువర్గాల్లో చర్చనీయాంశమైంది.

సిటీ నేత సిఫారసుపై రూరల్ నాయకుడి ఆగ్రహం

పీఆర్వో, ఏపీఆర్వోల పోస్టుల కోసం కాకినాడ సిటీ ముఖ్య ప్రజాప్రతినిధి సిఫారసు చేశారని సమాచారం. పోస్టులకున్న గిరాకీకి తగ్గట్టు భారీగా ముడుపులు ముట్టచెప్పిన రెండు పేర్లను సిటీ నేత ముందుగానే సిఫారసు చేశారని పోలీసు వర్గాల ద్వారా అందిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఈ విషయం ఆనోటా ఈనోటా బయటకు రావడంతో పోస్టింగ్‌లు ఎట్టి పరిస్థితుల్లోను ఇవ్వవద్దని రూరల్ నియోజకవర్గ ప్రజాప్రతినిధి పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారులకు తెలియచేశారంటున్నారు. తన పరిధిలోకి వచ్చే పోర్టులో నియామకాలకు సిటీకి సంబంధం ఏమిటంటూ పోలీసుల వద్ద బాహాటంగానే రూరల్ నేత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇద్దరు నేతలు తాడోపేడో తేల్చుకుంటామనే స్థాయిలో తలపడుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో పోలీసు అధికారులు ఎటూ తేల్చకుండా ప్రస్తుతానికి ఈ వ్యవహారాన్ని పెండింగ్‌లో పెట్టేశారని విశ్వసనీయ సమాచారం. ప్రస్తుతం పనిచేస్తోన్న పీఆర్వో, ఏపీఆర్వోలకు నాలుగు నెలల గడువు ఇంకా మిగిలి ఉండటంతో అప్పటి వరకూ ఈ వ్యవహారం పట్టించుకోకుండా వదిలేస్తే తలపోటు లేకుండా ఉంటుందనే అభిప్రాయంతో అధికారులు ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఈ వివాదం చివరకు ఎలా దారితీస్తుందోనని కూటమి నేతల మధ్య ఆసక్తికరమైన చర్చ సాగుతోంది.

అందరికీ అందుబాటులో 4జీ సేవలు

బీఎస్ఎన్ఎల్ జీఎం రాజు



కాకినాడలో ర్యాలీ నిర్వహిస్తోన్న జీఎం రాజు, డీజీఎంలు, ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: బీఎస్ఎన్ఎల్ తక్కువ ధరలకే విస్తృతమైన సేవలు అందిస్తూ పూర్వవైభవాన్ని సంతరించుకునే దిశగా అడుగులు వేస్తోందని బీఎస్ఎన్ఎల్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనరల్ మేనేజర్ పలివెల రాజు పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బీఎస్ఎన్ఎల్ 4 జీ సేవలు ప్రజలకు అవగాహన కల్పించే సంకల్పంతో గురువారం కాకినాడలో ఉద్యోగులు ప్లకార్డులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి కల్పనా సెంటర్, వైఎస్సార్ బ్రిడ్జి, ఎస్పీ ఆఫీసు, సర్పవరం సెంటర్, భానుగుడి సెంటర్ వరకు నిర్వహించి తిరిగి భానుగుడి సెంటర్, మెయిన్‌రోడ్డు, సినిమా రోడ్డు మీదుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి చేరుకుంది. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రైవేటు కంపెనీల సర్వీసుల కంటే బీఎస్ఎన్ఎల్ సెర్వీసులలో అతి తక్కువ ధరలకే 4జీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయన్నారు. ఇందుకోసం రాజమహేంద్రవరం సర్కిల్ పరిధిలోని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాతో పాటు రంపచోడవరం ఏజెన్సీలో సైతం అదనంగా టవర్‌లు నిర్మిస్తున్నామన్నారు. డిప్యూటీ జనరల్ మేనేజర్‌లు రాజశేఖరబాబు, సీహెచ్‌వీ సత్యనారాయణ, సయ్యద్ నాయక్, ఐఎఫ్ఎ నాగరాజు, డీఈ ఈశ్వర్, టెలికమ్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యుడు ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

త్వరితగతిన గృహనిర్మాణాలు

కాకినాడ సిటీ: గృహనిర్మాణాలకు సంబంధించి రూఫ్ లెవెల్, రూఫ్ కాస్ట్ దశలో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా గృహనిర్మాణాల పురోగతిపై హౌసింగ్ ఈఈ, డీఈలు, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో హౌసింగ్ కాలనీలో వివిధ దశల్లో ఉన్న గృహాల వివరాలు, అంతర్గత రహదారులు ఇతర మౌలిక సదుపాయాలు, బిల్లుల మంజూరు వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, ఈఈ డి గ్రాయిత్రీ రామ్, డ్వామా పీడీ ఎ వెంకటలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ కె శ్రీరమణి, పంచాయతీరాజ్ ఎస్ఈ మల్లికార్జున, కాకినాడ, పెద్దాపురం ఈఈలు కేవీఆర్ గుప్త, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈపీడీసీఎల్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గైగోలుపాడు అర్బన్ హెల్త్ సెంటర్ ఫస్ట్




ఇటీవల సందర్శించిన కేంద్ర బృందం సభ్యులతో వైద్యులు, సిబ్బంది, ఆశా వర్కర్లు

కాకినాడ రూరల్: వైద్య పరంగా నాణ్యతా ప్రమాణాలలో గైగోపాలుపాడు అర్బన్ హెల్త్ సెంటరు ప్రథమ స్థానంలో నిలిచిందని వైద్యురాలు శ్రీసుచంద్ర తెలియజేశారు. ఇటీవల కేంద్రం బృందం సభ్యులు రెండు రోజులు పాటు అర్బన్ హెల్త్ సెంటరులో ఉండి పరిశీలన చేశారు. వైద్య పరంగా నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్స్(ఎన్‌క్యూఏఎస్)లో 92శాతం లభించడంతో ప్రథమ స్థానంలో నిచిచామని గురువారం మీడియాకు తెలిపారు. కేంద్ర బృందంతో పాటు తనిఖీలో పాల్గొన్న డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టరు బి.సురేఖ, డీపీఎంఓ తాతపూడి ఆశారేఖలకు ధన్యవాదాలు తెలియజేశారు.

సత్యదేవుని 'జ్యోతిర్మయి వ్రతం' రద్దు

అన్నవరం: సత్యదేవుని సన్నిధిలో జ్యోతిర్మయి సత్యదేవుని వ్రతం నిర్వహించేందుకు గతంలో ఇచ్చిన ఆదేశాలను దేవదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ రద్దు చేశారు. గత ఏడాది ఎస్ఎస్ చంద్రశేఖర్ అజాద్ ఈఓగా ఉన్నప్పుడు జ్యోతిర్మయి సత్యదేవుని వ్రతం ప్రారంభించేందుకు కమిషనర్ అనుమతి ఇచ్చారు. దాంతో రామాలయం వద్ద గల అకౌంట్స్ సెక్షన్ కార్యాలయాన్ని ఈ వ్రతం నిర్వహించేందుకు వీలుగా మంటపంగా తయారు చేశారు. అయితే ఈ వ్రతం నిర్వహించేందుకు ఎనిమిది గంటలకు పైగా పడుతుందని అంత సమయం భక్తులు ఉండలేరనే అభిప్రాయం వ్యక్తమైంది. గత నవంబర్‌లో ఈఓగా బాధ్యతలు స్వీకరించిన కె.రామచంద్రమోహన్ దేవస్థానం వైదిక కమిటీ అభిప్రాయం కోరగా ఈ వ్రతం నిర్వహణ కష్ట సాధ్యమని చెప్పడంతో ఈ వ్రతం నిర్వహణకు ఇచ్చిన ఆదేశాలను రద్దు చేయాలని ఈఓ కోరడంతో కమిషనర్ ఆమేరకు ఆదేశాలిచ్చారు. అయితే ఈ వ్రతాన్ని ప్రారంభించి ఆ తర్వాత సాధ్యాసాధ్యాలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పంపా నుంచి 100 క్యూసెక్కులు విడుదల



పంపా బ్యారేజీ నుంచి విడుదల చేసిన నీరు

అన్నవరం: అల్పపీడనం ప్రభావంతో కొద్ది రోజులుగా భారీ వర్షాలు పడుతుండటంతో అన్నవరం పంపా రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఫలితంగా రిజర్వాయర్ నీటిమట్టం గురువారం సాయంత్రానికి 100.3 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్‌లోకి 160 క్యూసెక్కుల చొప్పున ఇన్‌ఫ్లో ఉంటటంతో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 103 అడుగులు కాగా ప్రస్తుతం 100.3 అడుగులకు చేరింది. దీంతో ముందు జాగ్రత్తగా బ్యారేజీ రెండో నంబర్ గేటు ఎత్తి 100 క్యూసెక్కుల నీటిని సముద్రానికి విడుదల చేసినట్టు ఇరిగేషన్ పెద్దాపురం డివిజన్ ఈఈ శేష గిరిరావు గురువారం తెలిపారు. పంపా ఆయకట్టుకు 130 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నారు. పంపా మెయిన్ కెనాల్ ద్వారా 120 క్యూసెక్కులు, సబ్సిడరీ డ్యామ్ ద్వారా పది క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. పంపా రిజర్వాయర్ గరిష్ట నీటి నిల్వ 0.43 టీఎంసీ కాగా ప్రస్తుతం 0.33 టిఎంసీ నీరు నిల్వ ఉంది.

ప్రణాళికతో పని

కాకినాడ సిటీ: వ్యవసాయ అనుబంధ శాఖాధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అనుబంధ రంగాలైన వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య, సహకార, మార్కెటింగ్, లీడ్ బ్యాంక్, అటవీ శాఖలలో అమలవుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరే విధంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పురోగతి కనబరిచే విధంగా అధికారులు ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు. వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో సాగు దిగుబడి శాతాన్ని పెంచేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 50,500 కౌలు రైతు కార్డులు పంపిణీ చేశామన్నారు. సీసీఆర్సీ కార్డులు నూరుశాతం పంపిణీ పూర్తి చేసి, కౌలు రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ-క్రాప్ నమోదు, ప్రకృతి వ్యవసాయం కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. వంద రోజులు కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. వంద రోజులు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా పశుసంవర్ధకశాఖలో పశువుల షెడ్ల నిర్మాణం చేపట్టాలన్నారు. పాడి రైతులకు వర్కింగ్ క్యాపిటల్ కింద రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా గోదాములు, వాటి సామర్థ్యం వివరాలు సేకరించాలని తెలిపారు. మత్స్యశాఖ ద్వారా పీఎంఎంఎస్‌వై కింద లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. జిల్లాలోని సహ వనరులను దృష్టిలో ఉంచుకుని ప్రైమరీ సెక్టార్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. సీపీఓ పి త్రినాథ్, జిల్లా వ్యవసాయాధికారి ఎస్ విజయకుమార్, పశుసంవర్ధకశాఖ జేడీ ఎస్ సూర్యప్రకాశరరావు, జిల్లా మత్స్యశాఖాధికారి కరుణాకర్, మార్కెటింగ్ ఏడీ ఎం దుర్గాప్రసాద్, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, సబ్ డీఎఫ్ఓ టి అనూష పాల్గొన్నారు.




సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్ మోహన్

సర్కార్ బడుల్లో కూటమి కమిటీలు రిగ్గేశాయ్!

- జిల్లాలో 1,275 స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ల ఎన్నిక
- వాయిదా పడ్డ 3 పాఠశాలలకు నేడు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): గతంలో ఉన్న తల్లిదండ్రుల పర్యవేక్షణ కమిటీను పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)గా మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసి గురువారం కొత్త కమిటీల ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు చేసారు. గతంలో ఏవిధమైన రాజకీయ ప్రమేయం లేకుండా కేవలం తల్లిదండ్రులందరూ ఏకతాటిపై విద్యా పరిజ్ఞానం ఉన్న వారే ఛైర్మన్‌గా ఎన్నికై సభ్యులందరూ కలిసి పాఠశాల అభివృద్ధికి తోడ్పడేవారు. కానీ నేడు వాటన్నింటికి భిన్నంగా కూటమి ప్రభుత్వ నాయకులు పాఠశాలలపై కన్నేసి కమిటీ ఛైర్మన్‌లుగా పార్టీలో కష్టపడ్డవారిని నియమించుకునేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఉదాహరణకు ఒక గ్రామంలో నాలుగు పాఠశాలలు ఉంటే రెండు టీడీపీ,రెండు జనసేన లేదా బీజేపీకు ఇచ్చేలా ఒప్పందాలు చేసుకుని వారికి నచ్చిన వారిని నామినేటెడ్ పదవుల తరహాలో నియమించేసుకున్నారు. పదవీ కాలన్ని చేరొక సంవత్సరం ఛైర్మన్‌గా ఒప్పందం చేసుకుని కొన్ని చోట్ల ఏకగ్రీవం చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షులుగా, కార్యదర్శులుగా ఉన్న స్కూల్ కమిటీ ఛైర్మన్‌లుగా ఉండటం విశేషం. జిల్లాలో ఉన్న ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపల్, కార్పొరేషన్, ఎయిడెడ్, కేజీబీవీ తదితర పాఠశాలల్లో ఎన్నిక నిర్వహించారు. 1,281 పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించగా వీటిలో 1,275 పాఠశాలల్లో ఛైర్మన్లు ఎంపికయ్యారు. మరో మూడు స్కూళ్లలో సమానంగా ఓటింగ్ రావడంతో శుక్రవారం నిర్వహణకు మళ్లీ ఎన్నికకు ఏర్పాటుచేయగా మరో 3 స్కూల్స్‌కు కోర్టు స్టే వంటి కారణాలతో ఎన్నికలు నిర్వహించలేదు. విద్యార్థి తల్లిదండ్రులలో ఒకరికి మాత్రమే ఓటుహక్కు కల్పిస్తూ చేతులెత్తే విధానం ద్వారా ప్రతి తరగతి నుంచి ముగ్గురిని ఎంపికచేసి వారిలో ఛైర్మన్‌లను ఎంపిక చేశారు. వీరితో పాటు కమిటీల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్, స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు సర్పంచ్, ఉప సర్పంచ్ ఉంటారు. వీరితో పాటు ఇద్దరు కో-ఆప్షన్లుగా విద్యావేత్త, సోషల్ వర్కర్‌కి అవకాశం కల్పించారు. ఛైర్మన్‌ల అధ్యక్షతన మధ్యాహ్నం తొలి సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలలకు ఉన్న ప్రధాన సమస్యలపై చర్చించి తీర్మానం చేశారు.



ధర్మవరంలో టీడీపీ నేత దాట్ల అప్పన్నబాబు సమక్షంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ

ఎస్ఎంసీ ఎన్నికల్లో దౌర్జన్యం

ప్రత్తిపాడు రూరల్: మండలంలో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. మండలంలోని ధర్మవరం దళిత పేటలోని ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, స్థానిక టీడీపీ నేత దాట్ల అప్పన్న బాబు ఒక్కటై ఎన్నికలు నిర్వహించకుండా టీడీపీ బలపరిచిన అభ్యర్థి గుడాల నాని ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ప్రకటించారని వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి బండి సత్యనారాయణ తెలిపారు. దీనిపై అధికారులు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాచపల్లి దళితపేట ఎంపీపీ స్కూల్‌లో 56 ఓట్లుకు 38 మంది తల్లిదండ్రుల వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి బత్తిన సుబ్బారావు మద్దతుగా నిలవడంతో టీడీపీ నేతలు ఎన్నికలు నిర్వహించకుండా గొడవ సృష్టించారు. దౌర్జన్యంగా తమ వారిని బయటకు పంపేశారని టీడీపీ అభ్యర్థి మడికి విజయం ఏకగ్రీవంగా గెలిపొందినట్లు ప్రకటించారని సుబ్బారావు వాపోయారు.

టోటల్‌గా బాదుడే..

- ఆర్అండ్‌బీ రహదారులపై టోల్ వసూళ్లకు సిద్ధం
- స్పష్టత ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- పీపీపీపీ పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు
- ఉమ్మడి జిల్లాలో నాలుగు ప్రధాన రోడ్ల ఎంపిక

సాక్షి, అమలాపురం: 'మేము అధికారంలో వస్తే రాష్ట్ర ఆదాయం పెంచుతాం.. అభివృద్ధి పనులు చేస్తాం.. సంక్షేమ పథకాలను అమలు చేస్తాం' ఎన్నికల ప్రచార సభల్లో ఎక్కడకు వెళ్లినా టీడీపీ అధినేత హోదాలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పిన మాటలివి. ఇది నమ్మిన జనం కూటమికి ఓట్లు వేశారు. అయితే బాబు మార్కు ఆదాయం పెంచడం వేరే అని ఇప్పుడు ప్రజలకు అర్థమవుతోంది. గత ప్రభుత్వ హయాంలో రూ.కోట్లతో ఆధునీకరించిన రోడ్లపై టోల్ గేట్లు ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది. పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్ షిప్ (పీపీపీపీ)లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పలు కీలక రహదారులను ఎంపిక చేసి 'టోల్' వసూలుకు రెడీ అయ్యింది.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలక రహదారుల్లో టోల్ వసూలుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. తొలి దశలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అమలాపురం నుంచి బొబ్బర్లంక (36.40 కిలోమీటర్లు), రాజవరం నుంచి పొదలాడ (30 కిలోమీటర్లు), కాకినాడ జిల్లా పరిధి కాకినాడ నుంచి జొన్నాడ (55 కిలోమీటర్లు), రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం మీదుగా భద్రాచలం (102 కిలోమీటర్లు) వరకూ ఉన్న ఆర్అండ్‌బీ రహదారులను టోల్ రోడ్లుగా గుర్తించి వసూలుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆర్అండ్‌బీ నుంచి ప్రభుత్వం సేకరించనుంది. ఇక్కడ టోల్ వసూలును బట్టి మిగిలిన కీలక రహదారుల్లో సైతం టోల్ నిర్ణయిస్తారు.



పి.గన్నవరం వద్ద రాజవోలు- పొదలాడ రహదారి

కాసుల వేటకు రెడీ

కోనసీమ జిల్లాలో అమలాపురం- బొబ్బర్లంక రహదారి అత్యంత కీలకం. జిల్లా కేంద్రం అమలాపురం నుంచి రావులపాలెం, అక్కడి నుంచి అటు తణుకు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళతారు. అలాగే రాజమహేంద్రవరం, భద్రాచలం వెళ్లేవారు సైతం ఇదే రహదారిపై రాకపోకలు సాగిస్తుంటారు. పొదలాడ- రాజవోలు రహదారి సైతం కీలకమైంది. రాజోలు దీవి నుంచి విజయవాడ, ఇటు రావులపాలెం మీదుగా రాజమహేంద్రవరం వెళ్తుంటారు. ఈ రెండు రహదారులపై వాహనాల తాకిడి అధికం. ప్రయాణికుల వాహనాలతో పాటు వ్యవసాయ, ఉద్యాన పంటలు, ఆక్వా ఉత్పత్తులు సైతం అధికంగా ఇతర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి.



గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆధునీకరించిన అమలాపురం- బొబ్బర్లంక రహదారి

- కాకినాడ నుంచి జొన్నాడ రహదారి ఉమ్మడి జిల్లాలోనే అత్యంత ప్రధానమైంది. ఇది కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలో ఉంది. మధ్యలో రామచంద్రపురం, మండపేట పట్టణాలు కూడా ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన పంటల ఉత్పత్తులతోపాటు కోడిగుడ్ల ఎగుమతి సైతం అధికంగా ఉంటోంది. రాజమహేంద్రవరం నుంచి ఏజెన్సీకి వెళ్లే రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు రహదారికి సైతం వాహనాల తాకిడి అధికం. కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ జిల్లాల నుంచి చింతూరు మీదుగా ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రాలకు ఈ రహదారిపై ఉమ్మడి జిల్లా నుంచి ఎగుమతులు అధికంగా జరుగుతుంటాయి. ఇటువంటి కీలక రహదారులపై టోల్ గేట్లు పెట్టడం ద్వారా భారీగా ఆదాయాన్ని ఆర్జించాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తోంది. ఇప్పటికే జాతీయ రహదారులపై ఎడాపెడా టోల్ వసూళ్లతో వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. రావులపాలెం నుంచి విజయవాడ రహదారిలో ఏకంగా నాలుగు టోల్ గేట్లు ఉన్నాయి. స్టేట్ హైవేలపై కూడా టోల్ గేట్లు మొదలైతే ప్రయాణికులపై భారం పడనుంది.

అన్ని రోడ్లలోనూ..

స్టేట్ హైవేలుగా గుర్తించిన ఈ రోడ్లతోపాటు ఇంచుమించు అన్ని రోడ్లను పీపీపీపీ పద్ధతిలో ఆధునీకరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టత ఇచ్చారు. స్టేట్ హైవేలు అన్నింటినీ పీపీపీపీ పరిధిలోకి తీసుకు రావాలని ఆయన ఆదేశించారు. తద్వారా ప్రతి స్టేట్ హైవేలపై భవిష్యత్‌లో టోల్ వసూలు తప్పదని ఆయన తేల్చి చెప్పారు.

గత ప్రభుత్వంలోనే ఆధునీకరణ

కూటమి ప్రభుత్వం తొలి దశలో టోల్‌కు ఎంపిక చేసిన రోడ్లను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే ఆధునీకరించారు. మరీ ముఖ్యంగా రాజవోలు నుంచి పొదలాడ రహదారిని రెండు దశల్లో రూ.26 కోట్లతో అభివృద్ధి చేశారు. పి.గన్నవరం ప్రధాన పంట కాలువను ఆనుకుని ఉన్న ఈ రహదారి పలుచోట్ల కాలువ వైపు కుంగిపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగేవి. వాహనాలు కాలువలోకి దూసుకుపోయి పలువురు మృత్యువాత పడిన సంఘటనలూ ఉన్నాయి. ఈ రహదారిని విస్తరించడంతో పాటు పలుచోట్ల ఐరెన్ రెయిలింగ్ వేశారు. అలాగే అమలాపురం నుంచి కొత్తపేట, రావులపాలెం మీదుగా బొబ్బర్లంక వరకూ రూ.రెండు దశల్లో రూ.11.13 కోట్లతో ఆధునీకరించారు. గత ప్రభుత్వం తీర్చిదిద్దిన ఈ రోడ్లపై టోల్ గేట్లు పెట్టడం ద్వారా ఆదాయం పొందాలని కూటమి ప్రభుత్వం చూస్తోంది. గత ప్రభుత్వ హయాంలో స్టేట్ హైవేలపై టోల్ ప్రతిపాదనలు లేకున్నా అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టోల్ వసూలు చేసేస్తోందని సోషల్ మీడియా వేదికగా ఐ-టీడీపీ, జనసేన ఫాలోవర్లు నానాయాగి చేశారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశం 'సాక్షి'గా ప్రకటించినా కిమ్మనకుండా ఉండడం విశేషం.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కొల్లి సూర్యారావు (ఫైల్)

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఉత్తరాంధ్ర జిల్లాల బీజేపీ ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి కొల్లి సూర్యారావు (53) బుధవారం రాత్రి మృతి చెందారు. నడిపూడి లాకుల వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన దుర్మరణం పాలయ్యారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

11న క్రీడాకారుల ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ):జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11న అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహిస్తున్నట్ల సంఘ అధ్యక్షుడు టీవీఎస్ రంగారావు గురువారం తెలిపారు. ఈనెల 18, 19 తేదీలలో నాగార్జున యూనివర్సిటీలో అండర్-23 పురుషులు, మహిళల పోటీలలో పాల్గొనే జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు 11వ తేదీ ఉదయం 8 గంటలకు కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానానికి రావాలని ఆయన కోరారు.

మద్యం షాపు వద్ద వ్యక్తి మృతి

అమలాపురం రూరల్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మద్యం షాపు వద్దే మృతి చెందిన సంఘటన అమలాపురం రూరల్ మండలం సమనస గ్రామంలో గురువారం జరిగింది. అమలాపురం తాలూకా ఎస్సై శేఖర్‌బాబు కథనం ప్రకారం.. సమనసకు చెందిన ఏడుకొండలు (48) మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం నుంచి మద్యం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో దుకాణం వద్దే మృతి చెందాడు.

ఆశ కార్యకర్త ఆత్మహత్య


సుబ్బలక్ష్మి (ఫైల్)

యానాం: ఓ ఆశ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై మురుగానందన్ తెలిపారు. మెట్టకూరుకు చెందిన మల్లాడి సుబ్బలక్ష్మి (34) స్థానిక ఆరోగ్య శాఖలో ఆశ కార్యకర్తగా పని చేస్తుంది. గురువారం తన స్వగృహంలో ఉరేసుకుంది. మృతురాలి భర్త పోసియ్య శాయ్ అకాడమీలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా ఉండగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. అందులో ఒక కుమారుడు స్థానిక పెట్రోల్ బంకులో పనిచేస్తుండగా, మరొకడు ఇంటర్ చదువుతున్నాడు. ఇంటర్ చదువుతున్న కుమారుడు సరిగ్గా కళాశాలకు వెళ్లకపోవడం, మరో కుమారుడు పనికి వెళ్లకుండా తిరుగుతుండటంతో భర్త పోసియ్య భార్య సుబ్బలక్ష్మిని నిలదీశాడు. ఈ నేపథ్యంలో సుబ్బలక్ష్మి ఆత్మహత్యకు పాల్పడిందని ఎస్సై తెలిపారు.

కొత్త పాలసీతో మందుకు..

- ఇక నుంచి ప్రైవేట్ దందా
- ప్రభుత్వ దుకాణాలకు చెల్లుచీటి
- అక్టోబర్ నుంచి నూతన విధానం
- ప్రభుత్వ షాపుల్లో సిబ్బంది భవిష్యత్తు ప్రశ్నార్థకం
- దుకాణాల కోసం కూటమి నేతల ప్రయత్నాలు



కాకినాడ సిటీ: ఫుల్‌గా తాగించి పేద కుటుంబాలను చిత్తు చేసే విధానాలతో కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది.. నూతన మద్యం పాలసీని తెరపైకి తీసుకువచ్చింది. ప్రైవేట్ దందాకు తెరలేపింది.. మొదట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లుగానే అక్టోబర్ నుంచి కొత్త విధానాన్ని అమలు చేయనుంది. కేబినెట్ సమావేశంలో మెరుగైన మద్యం పాలసీని రూపొందిస్తామని సీఎం ప్రకటించారు. అంతేకాకుండా ధరలు తగ్గిస్తామని చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం విధానంతో కాంట్రాక్టర్లు బాగుపడతారని, ఇందులో అంతా కూటమి నేతలే ఉంటారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. గత ఎన్నికలకు ముందు టీడీపీ మేనిఫెస్టోలో కల్లుగీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని పొందుపరిచారు. అప్పట్లోనే ఇది పరోక్షంగా ప్రైవేట్ మద్యం దుకాణాల రాకను సూచించింది. 2019 ముందు వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 439 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉండేవి. వాటి ద్వారా మద్యం విక్రయాలు జరిగేవి. ప్రతి రెండేళ్లకు ఓసారి మద్యం దుకాణాలకు టెండర్లు పిలిచేవారు. లాటరీ పద్ధతిలో దుకాణాలను కేటాయించేవారు. కొన్ని కీలకమైన కూడళ్లలో ఉండే వైన్ షాపులకు పెద్ద ఎత్తున డిమాండ్ ఉండేది. రాజకీయ నాయకుల కనుసన్నల్లోనే అవి నడిచేవి. ప్రైవేట్ దోపిడీని అరికట్టేందుకు 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాలను నెలకొల్పింది. కాకినాడ జిల్లాలో 89 ప్రభుత్వ మద్యం దుకాణాలు, 8 బార్ అండ్ రెస్టారెంట్లు ఉండేవి. ఇప్పుడు తిరిగి 2014–19 నాటి పరిస్థితులే పునరావృత్తం కానున్నాయి.

పర్యవేక్షణ మాటేంటి?

నూతన విధానం అమల్లోకి వస్తే మద్యం దుకాణాల పర్యవేక్షణ బాధ్యత ఎవరికి అప్పగిస్తారనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖ ప్రస్తుతం రెండు విభాగాలుగా నడుస్తోంది. ఇందులో ఎస్ఈబీ (స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో) అక్రమ మద్యం నివారణ, మద్యం, స్మగ్లింగ్ కేసులను పర్యవేక్షిస్తూ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పని చేస్తోంది. సహాయ కమిషనర్ నుంచి జిల్లాలో ఎస్ఈబీ పోలీస్ స్టేషన్లు ఇందుకోసం పని చేస్తున్నాయి. ఎక్సైజ్ శాఖ మద్యం డిపోల నిర్వహణ, ప్రభుత్వ మద్యం దుకాణాల బాధ్యతను పర్యవేక్షిస్తోంది. ఇందు కోసం డిపో మేనేజర్లు, సీఐలు, ఎస్సైలు పని చేస్తున్నారు. కొత్త మద్యం పాలసీ తీసుకొస్తే రెండు విభాగాలను కలిపేసి, అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఉన్నట్లు చేస్తారా, ఉన్న దానిని కొనసాగిస్తారా? అనేది చూడాలి.

వారి పరిస్థితి ఏంటో?

మరోవైపు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఇద్దరు సేల్స్‌మెన్లు, ఒక సూపర్‌వైజర్ చొప్పున నిరుద్యోగులకు ఉపాధిని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కల్పించింది. ఇప్పుడు కొత్త మద్యం విధానం అమలైతే, ప్రభుత్వ దుకాణాలకు మంగళం పాడినట్లే. అదే జరిగితే ఇప్పటికే ఆయా దుకాణాల్లో పని చేస్తున్న వారు రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. మొత్తం జిల్లాలో 560 మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. తమ పరిస్థితి ఏంటన్న ఆందోళన వారిలో మొదలైంది.

అక్రమాల తలుపులు బార్లా!


అమలాపురంలో ప్రభుత్వ మద్యం దుకాణం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతి శాఖలో మిత్ర పార్టీల నాయకులు, కార్యకర్తల అక్రమార్జనకు వీలుండేలా పాలసీలు మారుస్తోంది. ఈ క్రమంలో నూతన మద్యం పాలసీని త్వరలో ప్రకటించేందుకు సిద్ధమవుతోంది. జిల్లాలో అక్రమార్జనకు చూస్తున్న కూటమి ద్వితీయ శ్రేణి నేతలు అధికారిక మద్యం షాపులు, బార్లు దక్కించుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇక తృతీయ శ్రేణి నాయకులు మాత్రం అనధికార బెల్ట్ షాపుల కోసం ఎమ్మెల్యేలను ఆశ్రయిస్తున్నారు. కొందరు ఎమ్మెల్యేలు కొత్త మద్యం పాలసీ ప్రకటించాక ఆ విధి విధానాలు చూసి అందరికీ న్యాయం చేస్తానని హామీ ఇస్తుంటే, ఇంకొందరు ఒక అడుగు ముందుకేసి అనధికార బెల్ట్ షాపులు పెట్టుకునేందుకు ఆయా గ్రామాల్లో అవకాశం కల్పిస్తూ ఆదేశాలు ఇచ్చేస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా, అమలాపురం నియోజకవర్గంలోని పట్టణంతో పాటు 60 గ్రామాల్లో అనధికార బెల్ట్ షాపుల పంపకానికి తెరలేచింది. దీని ప్రకారం దాదాపు 80 బెల్ట్ షాపులు వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే అమలాపురం నియోజకవర్గంలో కొమరిగిరిపట్నం, పేరూరు, బండారులంక, కామనగురువు, ఉప్పలగుప్తం, గొల్లవిల్లి వంటి మేజర్ పంచాయతీల్లో కూటమికి చెందిన తృతీయ శ్రేణి నాయకులు తమ ప్రాంతాల్లోని బెల్ట్ షాపుల కోసం పైరవీలు చేస్తున్నారు. ఇందులో కొందరికి మాట కూడా ఇచ్చేశారు. కోనసీమ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 4 వేల అనధికార మద్యం బెల్ట్ షాపులు ఉండేవి. అదీ గుడి, బడి నిబంధనలను పక్కన పెట్టి ఇష్టానుసారంగా పెట్టారు. ఇళ్ల మధ్య, కాకా హోటళ్లు, గల్లీల్లోని కిళ్లీ షాపులు ఇలా ఎక్కడ పడితే అక్కడ బెల్ట్ షాపులు నిర్వహించేవారు. ఈ విధానానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చరమగీతం పాడింది. మద్యం షాపులను ప్రైవేట్ వ్యక్తుల గుప్పిట్లోంచి తప్పించి ప్రభుత్వమే ఆ షాపుల నిర్వహణ చేపట్టి బెల్ట్ షాపులను పాతాళంలోకి తొక్కేసింది. ఇప్పుడు కోనసీమ జిల్లాలో అవుట్ లెట్స్ (మద్యం దుకాణాలు) 81, బార్లు 10, మాల్స్ 19 ఉన్నాయి. జిల్లాలో ఎక్సైజ్ కొత్త పాలసీ అమలు సిద్ధం అవుతున్న తరుణంలో అవుట్ లెట్స్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో టెండర్ల పేరుతో పెట్టి రూ.కోట్లు దండుకునేలా కూటమి ప్రభుత్వం ఉంది. ఈ క్రమంలో జిల్లాలో ప్రస్తుతం ఉన్న 81 అవుట్ లెట్స్ స్థానే పట్టణాలు, మండల కేంద్రాలు, కొన్ని కీలక గ్రామాల్లో దాదాపు 150 మద్యం దుకాణాలు వెలిసే అవకాశం ఉందని తెలిసింది. బార్ల సంఖ్య రెట్టింపయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

రోడ్డు దిగువకు దూసుకుపోయిన బస్సు


అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకుపోయిన ట్రావెల్స్ బస్సు

రాజానగరం: జాతీయ రహదారిపై దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద ఓ ప్రైవేట్ బస్సు అదుపుతప్పి రోడ్డు దిగువకు దూసుకుపోయింది. బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. పెట్రోలింగ్ పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి శ్రీకాకుళం జిల్లా పాలకొండకు సుమారు 40 మంది ప్రయాణికులతో వెళ్తున్న కేవీఆర్ ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి 1.45 గంటల సమయంలో గామన్ బ్రిడ్జి రోడ్డు మీదుగా అతివేగంతో వస్తూ దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద మలుపు తిరిగే సమయంలో అదుపు తప్పింది. రోడ్డు దిగువకు దూసుకుపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడం, రోడ్డుకు దిగువకు వెళ్లి బస్సు ఆగిపోవడంతో లోపలున్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదు. రాత్రి పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న డీఎస్పీ సౌత్ జోన్ డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్, ధవళేశ్వరం సీఐ వి.వినయ్‌మోహన్, ప్రకాష్‌నగర్ ఎస్సై శివప్రసాద్, తదితరులు సంఘటనా స్థలానికి చేరుకుని, బస్సులోని ప్రయాణికులను వేరే బస్సులోకి ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించే ఏర్పాట్లు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

సామర్లకోట: స్థానిక గొల్లపేటలో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు పెద్దాపురం ఎంఎస్ఓ విజయలక్ష్మి, జగ్గంపేట డిప్యూటీ తహసీల్దార్ కృష్ణలు సంఘటనా ప్రదేశానికి చేరుకుని ఇంట్లో నిల్వ చేసిన బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. సుమారు రెండు టన్నుల బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు అధికారులు చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలతో దేశ ప్రగతి


సామర్లకోట ఈటీసీలో శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనతో దేశ ప్రగతి సాధ్యమవుతుందని విస్తరణ శిక్షణా కేంద్రం (ఈటీసీ) ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ అన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకూ 11 జిల్లాల్లోని జిల్లా స్థాయి అధికారులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో సుపరిపాలన కలిగిన గ్రామం అనే అంశంపై మూడు రోజుల శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదరికం లేని, ఆరోగ్యకర, పిల్లల స్నేహపూర్వక, నీటి సమృద్ధి, పరిశుభ్రమైన హరిత, స్వయం సమృద్ధితో మౌలిక సుదుపాయాల గ్రామాలు అనే అంశాలను గుర్తించిందన్నారు. వీటిపై జిల్లా స్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించడంతో స్థానిక ఈటీసీలో 11 జిల్లాలోని అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ నాలుగు అంశాలపై శిక్షణ పూర్తయ్యిందన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులు మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చి గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు అమలు జరిగే విధంగా చూడాలన్నారు. ప్రతి గ్రామంలో పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి అందరికీ కనిపించే విధంగా నోటీసు బోర్డులో ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ పి.శ్రీనివాసరావు, వి.ప్రసాద్, బి.ఆంజనేయులు, బి.వెంకటేశ్వర్లు, చక్రపాణిరావు, కేఆర్ నిహారిక, పద్మజ పాల్గొన్నారు.

ఇసుకంతైనా భయం లేకుండా..

- తప్పుడు పత్రాలతో ఇసుక తరలింపునకు యత్నం
- చివరికి అధికారులకు చిక్కిన వైనం


పెరవలి పోలీస్ స్టేషన్ వద్ద స్వాధీనం చేసుకున్న ఇసుక లారీ

పెరవలి: ఇసుక అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నారు.. తవ్వేకొద్దీ బయటకొస్తున్నాయి. తమకు అనుమతులు ఉన్నాయంటూ పత్రాలు చూపించి ఇసుక తరలించుకుపోతుండగా అధికారులు గుర్తించారు. చివరికి ఆ ఇసుక లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించగా, అధికారులేమో మొదటి తప్పుగా భావించి జరిమానా విధించి వదిలేస్తాననడం శోచనీయం. పెరవలి మండలం ఉసులుమర్రులో ర్యాంపు వద్ద ఇసుక స్టాక్ పాయింట్ ఉంది. దీనిని రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ అక్రమాలపై ఈ నెల 5న 'సాక్షి' దినపత్రికలో 'ఇసుక మాయం' అనే శీర్షికన కథనం వచ్చింది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 6వ తేదీన ర్యాంపును మూసివేశారు. మళ్లీ బుధవారం నుంచి అమ్మకాలు యథావిధిగా ప్రారంభించారు. అదే రోజు సాయంత్రం విశాఖపట్నంలోని ఎన్‌టీపీసీ సంస్థకు చెందిన 5 ఇసుక లారీలు ఉసులుమర్రు స్టాక్ పాయింట్ వద్దకు వచ్చాయి. తమకు ఇసుక ఇవ్వడానికి సబ్ కలెక్టర్ అనుమతులు ఉన్నాయని చెప్పి, సదరు సంస్థ లారీ డ్రైవర్లు చెప్పటంతో ఇసుక లోడింగ్ చేశారు. అయితే అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారులకు అనుమానం వచ్చి సదరు డ్రైవర్లు ఇచ్చిన అనుమతి పత్రాలు తనిఖీ చేయగా అందులో నాలుగు లారీలకు అనుమతులు ఉన్నాయని, మిగిలిన ఒకదానికి లేకపోవటంతో ఆ లారీని పెరవలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఇసుక స్టాక్ పాయింట్ వద్ద విధులు నిర్వహిస్తున్న డీటీ సన్నిబాబును 'సాక్షి' వివరణ కోరగా ఐదు లారీలు రావడం వాస్తవమేనని, ఇందులో నాలుగు లారీలకు అనుమతులు ఉన్నాయన్నారు. మిగిలిన దానికి అనుమతులు లేవని, దీంతో ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చానన్నారు. ఆ లారీని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారని తెలిపారు. దీనిపై మైనింగ్ డీడీ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తీసుకెళ్లడానికి వచ్చిన లారీపై మొదటి తప్పుగా భావించి జరిమానా విధిస్తామని, ఎటువంటి కేసు నమోదు చేయలేదని సమాధానం ఇచ్చారు. కొన్ని రోజులుగా పై సంస్థకు ఈ స్టాక్ పాయింట్ నుంచి రోజుకు 5, 6 లారీల చొప్పున ఇసుకను తరలిస్తున్నారని స్థానిక డ్రైవర్లు చెప్పారు. ఇలా అనుమతుల ముసుగులో ఎన్ని అక్రమాలు జరిగాయో అని అంతా చర్చించుకుంటున్నారు.

స్వర్ణమయం.. బహుసుందరం

సత్యదేవుని ఆలయంలో ధ్వజ స్తంభానికి స్వర్ణ రేకు తాపడం పనులు


ధ్వజస్తంభానికి స్వర్ణ రేకు తాపడం చేసిన తర్వాత ధగధగలు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయం ముంగిట ధ్వజస్తంభం స్వర్ణ శోభతో కళకళలాడుతోంది. నూతన ధ్వజ స్తంభానికి స్వర్ణ రేకు తాపడం పనులు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత పండితులు సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిబ్బంది ధ్వజస్తంభం పీఠం పైభాగం నుంచి స్వర్ణ రేకులు తాపడం చేసే పని ప్రారంభించారు. సాయంత్రానికి ధ్వజస్తంభం శిఖరం వరకూ పనులు పూర్తి చేశారు. రాత్రికి మేఖలాలు, సుదర్శన చక్రం ఏర్పాటు చేస్తారని అధికారులు తెలిపారు. శ్రావణ శుద్ధ పంచమి, శుక్రవారం ఉదయం 10–20 గంటల ముహూర్తంలో ధ్వజస్తంభానికి అమర్చిన స్వర్ణ మేఖలాలు, సుదర్శన చక్రానికి ప్రత్యేక పూజలు చేసి లాంఛనంగా ప్రారంభిస్తారు. నెల్లూరుకు చెందిన దాతల సహకారంతో రూ. మూడు కోట్లతో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ, దానికి స్వర్ణ కవచం అమర్చే పనులు గత ఏడాది ప్రారంభమైన విషయం విధితమే. ఏప్రిల్ 22న నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. సుమారు 300 కిలోల రాగితో రూపొందించిన ధ్వజస్తంభం కవచాలకు చెన్నైకు చెందిన స్మార్ట్ క్రియేషన్స్ సంస్థం ఆధ్వర్యంలో బంగారు పూత పనులు చేయించారు. కాగా, గురువారం ఉదయం నుంచి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం, డీఈఈ ఉదయ్, స్మార్ట్ క్రియేషన్స్ అధినేత సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారుల పర్యవేక్షణలో తాపడం పనులు ప్రారంభించారు.

పీఠానికి కూడా..

ధ్వజస్తంభం పీఠానికి కూడా స్వర్ణరేకు తాపడం చేయడానికి దాత సంసిద్ధత వ్యక్తం చేశారు. తొలుత పీఠం నుంచి స్వర్ణ రేకు తాపడం చేయాలని భావించినా తొలి దశలో పీఠం పైనుంచి స్వర్ణ రేకు తాపడం చేయించేందుకు దాతకు అనుమతి ఇచ్చారు. పీఠానికి కూడా చేయించేందుకు దాత ముందుకు రావడంతో ఆ మేరకు అధికారులు సంసిద్ధత వ్యక్తం చేశారు. దీనికి మరో రూ. రెండు కోట్లు కానుంది. ఈ మేరకు ఈ నెల 20న అధికారులు తుది నిర్ణయం తీసుకుంటారు.


కూటమి అరాచకాలకు అనపర్తి పరాకాష్ట

- ఇల్లపల్లి సర్పంచ్‌పై దాడి అమానుషం
- మాజీ ఎమ్మెల్యేలు సూర్యనారాయణరెడ్డి, జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి


ఇల్లపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

బిక్కవోలు: టీడీపీ అధికారంలో వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న దాడులు, అరాచకాలకు అనపర్తి నియోజకవర్గం పరాకాష్టగా మారిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. గురువారం ఇల్లపల్లి గ్రామంలో సర్పంచ్ లోల్ల భద్రంపై దాడి జరగ్గా, ఆయన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రాజా మాట్లాడుతూ జనసేన, బీజేపీలతో జతకట్టి సూపర్ సిక్స్ పథకాలు, అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రజలకు చేస్తుందేమీ లేదని ధ్వజమెత్తారు. తమకు ఓట్లు వేయని వారిని ఇబ్బందులు పెట్టాలనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఇలాంటి ఘటనలకు ఇల్లపల్లి గ్రామం నుంచే తిరుగుబాటు మొదలైందని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌పై దాడికి దిగి, ఈడ్చుకెళ్లి చిత్రహింసలకు గురి చేస్తే స్థానిక ఎమ్మెల్యే, టీడీపీ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఇక్కడి ప్రజలు సమైక్యంగా సర్పంచ్‌ని కాపాడుకున్నారని, అయితే రాష్ట్రంలో ఇప్పటికే వందల మంది వైఎస్సార్ సీపీ శ్రేణులు చిత్రహింసలకు గురయ్యారని రాజా అన్నారు. ఐదేళ్ల తర్వాత అధికారం పోయాక మీరు తెచ్చిన ఇలాంటి దుష్ట సంప్రదాయం మీకే ఎదురవుతుందన్న విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఇలాంటి దాడి ఘటన మరొకటి జరిగితే ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి ఇంటికి వేల మందితో వెళ్లి తిరుగుబాటు చేస్తామన్నారు. శాంతి భద్రతలు కాపాడడంలో ప్రభుత్వం, పోలీసులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కొంత మందికి తొత్తులుగా పనిచేయవద్దని హితవు పలికారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందన్నారు. దాడులు ఆపకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదన్నారు. డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలకు ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు అల్లు రాజాబాబు, రంగాపురం సర్పంచ్ గండికోట వీరభద్రం, పందలపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్, పార్టీ మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, నాయకులు బోడా రాజాబాబు, మట్ట శ్రీను, పోలునాటి పోతురాజు పాల్గొన్నారు.

గణపయ్యా.. కాస్త చూడవయ్యా!


ఆలయ ముఖ మండపంలో అధ్వానంగా శ్లాబ్

అయినవిల్లి: నిత్యం రద్దీగా ఉండే ఆలయం అది. అయినా ఎవరూ పట్టించుకోక ప్రమాదం పొంచి ఉంది. అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారి ఆలయంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయం ప్రాంగణంలో ముఖ మండపంపై శ్లాబ్ పెచ్చులుగా ఊడి పడుతోంది. దీంతో లోపల ఐరన్ మెస్ కూడా బయట పడింది. సెలవులు, పర్వదినాల సమయంలో భక్తుల సందడి ఎక్కువగా ఉంటుంది. వినాయక చవితి ఉత్సవాలు కూడా దగ్గర పడ్డాయి. ఈ సమయంలో శ్లాబ్ పెచ్చులూడి పడడం భయాందోళనకు గురిచేస్తోంది. ఈ విషయమై ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజును వివరణ కోరగా ఆలయ అభివృద్ధికి ఉన్నతాధికారులకు నివేదించినట్లు వివరించారు. త్వరలోనే ఆలయ ముఖ మండపాన్ని కూల్చి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అన్నారు.